


6



కొలువుదీరిన దేవీ ప్రతిమలు

- ప్రారంభమైన శరన్నవరాత్రులు
- కొనసాగుతున్న పూజలు
- శోభాయాత్రగా మండపాలకు విగ్రహాల తరలింపు

7



‘స్థానిక’ ఎన్నికలపై ముందడుగు

జిల్లాలో మొత్తం ఓటర్లు	8,51,417
మహిళలు	4,54,621
పురుషులు	3,96,778
ఇతరులు	18

జిల్లాలో..

- 545 గ్రామపంచాయతీలు
- 5022 వార్డులు
- 31 జడ్పీటీసీ స్థానాలు
- 307 ఎంపీటీసీ స్థానాలు



- ఎన్నికల నిర్వహణకు కసరత్తు
- రిజర్వేషన్ల ఖరారుపై మార్గదర్శకాలు విడుదల
- రెండు మూడు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు అయ్యే అవకాశం
- గ్రామాల్లో మొదలైన రాజకీయ సమావేశాలు

నిజామాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకు వేసింది. సెప్టెంబరు 30లోగా స్థానిక ఎన్నికల నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దసరా పండగ ముందే స్థానిక ఎన్నికల నగారా మోగే అవకాశాలు ఉన్నాయి. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను ఆదేశించిన నేపథ్యంలో అధికారులు స్థానిక రిజర్వేషన్లను ఖరారు చేసే పనిలో ఉన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది ఈ మేరకు అధికారులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన విషయం తెలి సిందే. బీసీ రిజర్వేషన్ల విషయమై ఇప్పటికే ప్రభుత్వం అసెంబ్లీలో జీవో విడుదల చేసి గవర్నర్ వద్ద ఫైలు పెండింగ్‌లో ఉండగా ఆ అంశంపై స్పష్టత రాగానే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై స్పష్టత లేకపోవడంతో స్థానిక ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించడం కష్టమని ప్రచారం జరగగా స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆశపడ్డ నేతలు గత కొద్ది కాలంగా స్తబ్ధుగా ఉంటున్నారు ఇప్పుడు ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో గ్రామాలలో మళ్లీ రాజకీయ సమావేశాలు మొదలయ్యాయి. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా పోటీ చేసే అభ్య ర్థులు గ్రామాల్లో జరుగుతున్న కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

రిజర్వేషన్ల ఖరారుపై మార్గదర్శకాల విడుదల..

స్థానిక సంస్థల ఎన్నికలపై పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల సన్నద్ధత కార్యాచరణను విడుదల చేసింది. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేసింది. సర్పంచులు, వార్డు మెంబర్లు ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ చైర్మన్‌ల ఎన్నికలు మాత్రం పరోక్షంగా ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వే ప్రతిపాదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు.

మిగతా 8వ పేజీలో...

రిజర్వేషన్ల ఖరారు బాధ్యత కలెక్టర్‌కు..

జిల్లాలోని జడ్పీటీసీ స్థానాలతో పాటు మండల పరిషత్ అధ్యక్షస్థానాల రిజర్వేషన్ల నువ్వు ఖరారు చేసే బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. జిల్లా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్ల ఖరారు బాధ్యత మాత్రం రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధి కల్పన కమిషనర్ ఖరారు చేస్తారు. సర్పంచు పదవుల రిజర్వేషన్‌లను స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, వార్డు సభ్యుల రిజర్వేషన్లను మండల ఎంపీడీవో ఖరారు చేస్తారు. రిజర్వేషన్ల కేటాయింపుల్లో గత ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ బీసీలకు కేటాయించిన స్థానాలను మినహాయించి మిగిలిన స్థానాలలో ఆయా వర్గాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ కేటగిరిలలో మహిళలకు 50శాతం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయించిన తర్వాతనే మిగిలిన సీట్లను జనరల్ (అన్ రిజర్వుడ్) కేటాయించనున్నారు.



పోలీసు కమిషనర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం ఆనంద్

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

- పోలీసు కమిషనర్‌కు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ వినతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీ సాయిచైతన్యను నిజామాబాద్ డిపో-1 మేనేజర్ ఆనంద్ కోరారు. జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ కార్యాలయంలో కలిసి బస్టాండ్ ప్రాంగణంలో ట్రాఫిక్ సమస్యపై వినతిపత్రం అందజేశారు. బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందిగా ఉందని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీకి తెలిపారు. బస్టాండ్ ఎదుట ఆటోలతో ఇబ్బందిగా మారిందని సమస్యను పరిష్కరించాలని కోరారు. సీపీని కలిసిన వారిలో ఆర్టీసీ విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ మహిపాల్, ప్రభుదాస్ ఉన్నారు.

‘ప్రజావాణి’ వినతులను పరిష్కరించాలి

- 89 ఫిర్యాదులను స్వీకరించిన వివిధ శాఖల అధికారులు

8



పూజలు చేస్తున్న సీపీ సాయిచైతన్య

దుర్గామాతకు సీపీ పూజలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వాటర్స్‌లో కొలువుదీరిన దుర్గామాత భక్తులకు బాల త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. తొలిరోజైన సోమవారం అమ్మవారిని సీపీ సాయి చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటేష్ శర్మ, అదనపు డీసీపీ అడ్మిన్ బస్వారెడ్డి, రిజర్వు ఇన్స్‌పెక్టర్ అడ్మిన్ శ్రీనివాస్, ఎంటీవో శేఖర్ బాబు, వెల్ఫర్ తిరుపతి, హోంగార్డ్ సతీష్, దుర్గా పరమేశ్వరి మాత, ఆర్గనైజేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ హెల్ప్‌డెస్క్

ఇందల్వాయి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ టీయూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో హెల్ప్‌డెస్క్ నిర్వహించారు. ఐసెట్ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల అడ్మిషన్లకు ప్రక్రియలో బాగంగా హెల్ప్‌డెస్క్ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. నూతనంగా అడ్మిషన్ పొందే ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్నా యూనివర్సిటీ ఏబీవీపీ శాఖను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి సమీర్, ఉపాధ్యక్షుడు అశోక్, జాయింట్ సెక్రెటరీ అనిల్ తదితరులు ఉన్నారు.

సంస్కృతిని ప్రతిబింబించేలా సంబరాలు నిర్వహించాలి

- వేడుకలకు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై బతుకమ్మ వేడుకల నిర్వాహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలన్నారు. ముఖ్య కూడళ్ల, జనసంచారంతో ఉండే ప్రదేశాల్లో హోర్డింగ్స్, బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలను, నిమజ్జనం చేసే చెరువులు, ఇతర నీటి వనరుల వద్ద లైటింగ్, సౌండ్ సిస్టం వంటి వసతులను కల్పించాలన్నారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈనెల 26న



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఎడపల్లి మండలం అలిసాగర్ రిజర్వాయర్ వద్ద బతుకమ్మ ఉత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 30 వరకు కొనసాగే బతుకమ్మ ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని అన్నారు. 30న సద్దుల బతుకమ్మను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మెప్మా పీడీ రాజేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, పరిశ్రమల శాఖ మేనేజర్ సురేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ సీఈవో హరిసింగ్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నోడల్ అధికారి ప్రసాద్‌లు పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్ నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సాత్విక్, జితేందర్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ బయోమెడికల్ నిర్వహణపై సమీక్ష

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని బయో మెడికల్ నిర్వహణపై జిల్లా సమన్వయ కమిటీ కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, బ్లడ్ బ్యాంక్‌లు, ఎక్స్‌రే క్లీనిక్‌లు, ఆసుపత్రులు సుమారు వెయ్యి వరకు రిజిస్టర్ అయి ఉన్నందున వాటి వద్ద నుంచి తయారయ్యే వ్యర్థాలను మెడికేర్ నిర్వహణ సంస్థకు అందజేయాలన్నారు. మెడికేర్ నిర్వహణ సంస్థ నుంచి సర్టిఫికెట్‌ను విధిగా పొందాలని సూచించారు. ప్రతి ఆసుపత్రి నుంచి బయోమెడికల్ వ్యర్థాలను మెడికేర్ వాహనాల్లో 24 గంటల్లో తరలించాలని అన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో బయోమెడికల్ వెస్టేజ్ ట్రీట్‌మెంట్‌కు తరలించాలని సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో ఉన్న అన్ని ఆసుపత్రులు వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రాలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ మాల్వియా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ లక్ష్మణ్ ప్రసాద్, మెడికేర్ బయో మెడికల్ ట్రీట్‌మెంట్ ప్లాన్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారుల భూసేకరణపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

- వీసీలో పాల్గొన్న కలెక్టర్

8

జాతీయ ఆయుర్వేద దినోత్సవ ర్యాలీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవం ర్యాలీని జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల పార్క్ నుంచి ఆయుర్వేద ర్యాలీని ఆయుష్ విభాగం ఇంచార్జి గంగాదాస్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈనెల 23న ఆయుర్వేద వైద్యశిబిరం అర్సపల్లి గ్రామంలోని వివేకానంద యోగా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతి, వందనరెడ్డి, పురుషోత్తం, ఉమాప్రసాద్ పాల్గొన్నారు.

యమ్మీ..



ఎన్ని బాధ్యతలున్నా బతుకమ్మ ఆడతా..

బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంటుంది. ప్రతీ సంవత్సరం చేసే వృత్తిలో బాధ్యతలు ఎన్ని ఉన్నా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటాను. తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ వేడుకలు ప్రతీ ఆడపడుచు సంబురంగా జరుపుకునే పండగ. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని పూజించడం వల్ల అనుగ్రహం ఉంటుంది.

- స్వప్న, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, నిజామాబాద్



భక్తిని, ఆరోగ్యాన్ని అందించే పండుగ..

బతుకమ్మ పండుగ భక్తితో పాటు ఆరోగ్యాన్ని అందించే వేడుక. ఆడపడుచులు తమ తల్లిగారింటికి వచ్చి బతుకమ్మ ఆడుతారు. బతుకమ్మలో వాడే ప్రతీ పువ్వు ఔషధ గుణాన్ని కలిగి ఉంటుంది. బతుకమ్మను నిమజ్జనం చేసిన పూలల్లో ఉన్న ఔషధ గుణాలు నీటిలో చేరేవి. గతంలో ఆ నీటిని తాగేవాళ్లం. 9 రోజులు సంతోషంగా ఆడిపాడుతాం.

- హరితగౌడ్, ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల కరస్పాంటెండెంట్



ఆడపడుచుకు సంబురానిచ్చే వేడుక..

ఆడపడుచులు గొప్పగా జరుపుకునే పండగ బతుకమ్మ సంబురాలు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలను పేర్చి బతుకమ్మను తయారు చేసుకొని అందులో గౌరీ దేవతను పూజించడం ఆధ్యాత్మికతను తెలుపుతుంది. బతుకమ్మ వేడుకల్లో మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో నిర్వహించడం తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తుంది. ఏటా నేను వేడుకల్లో పాల్గొంటాను. - రేఖ, తహసీల్దార్, మోపాల్



క్రైం సమాచారం

పెళ్లి కావట్లేదని యువకుడి ఆత్మహత్య



మహేష్(ఫైల్)

కామారెడ్డిరూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సన్నపల్లికి చెందిన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధ్యాప మహేష్(28) జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లొచ్చాడు. పెళ్లిడు రావడంతో అతడికి తండ్రి సాయిలు పలు పెళ్లి సంబంధాలు చూసినా కుదరలేదు. మహేష్ తనకు పెళ్లికావడం లేదని, మదన పడుతుండేవాడు. గతంలో 2సార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కొడుకు కోసం సాయిలు వెతుకుతుండగా రైలుపట్టాలపై విగతజీవిగా కనపడ్డాడు. ఈ విషయం కుటుంబీకులు, గ్రామస్థులకు తెలపడంతో వారు రైల్వేఅధికారులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో సాయిలుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు.

రెండోసారి తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగ



బర్కత్‌పుర కాలనీలో ఇళ్లపై పడిన వైర్

నవీపేట,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలోని బర్కత్‌పుర కాలనీలో సోమవారం 11కేవీ విద్యుత్ వైర్ ప్రమాదవశాత్తు తెగిపోయి పలు ఇళ్లపై పడింది. ఇదే కాలనీలో శనివారం వైర్ తెగి పలు ఇళ్లప పడగా.. సోమవారం మరోసారి జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కరెంట్ సరఫరాను నిలిపివేశారు. బర్కత్‌పుర కాలనీలో ఇళ్లపై ఉన్న 11కేవీ వైర్లను తొలగించాలని సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట పలువురు స్థానికులు ధర్నా చేశారు. బర్కత్‌పుర కాలనీలో పలు ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న 11కేవీ వైర్లను వెంటనే తొలగించాలని లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని జనవికాస్ సేవాసంస్థ జిల్లాధ్యక్షుడు పోశెట్టి హెచ్చరించారు. ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈ ఆనంద్ కుమార్, నాయబ్ తహసీల్దార్ రంజిత్‌కుమార్, ఆర్ఐ సాయిలుకు వినతిపత్రం అందజేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లికి చెందిన రాజు(43) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజు కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య గోదావరి, ఒక కూతురు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ తిరుపతిని వివరణ కోరగా రాజు ఆత్మహత్య చేసుకున్నది నిజమేనని, సోమవారం సాయంత్రం వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి విద్యార్థి మృతి



సాయిచరణ్ (ఫైల్)

మద్నూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ఎక్లారలో ప్రమాదవశత్తు చెరువులో పడి సాయి చరణ్(15) అనే విద్యార్థి మృతిచెందినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. మద్నూర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదు వుతున్న సాయిచరణ్ సెలవుల నేపథ్యంలో ఇంటికెళ్లాడు. సోమవారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లి కాలు జారి చెరువులో పడి మృతిచెందాడని ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి సంజు ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు..



సత్యనారాయణ (ఫైల్)

దోమకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టుముక్కలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మడతల సత్యనారాయణ సోమవారం తెల్ల వారుజామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి బద్దం ఇంద్ర కరణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, అనంత్‌రెడ్డి, ప్రసాద్, సంతోష్‌రెడ్డి బాధిత కుటుంబీకులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

● మరొకరి పరిస్థితి విషమం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంతో చెట్టును ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం డిచ్‌పల్లి నుంచి వైపు కారులో వస్తుండగా ధర్మారం మూలమలుపు వద్ద అదుపుతప్పి కారు బోల్తా కొట్టి చెట్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ధర్మారం గ్రామానికి చెందిన సుశాంత్(22), మమ్ముకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుశాంత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా.. మమ్ము పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుశాంత్ మృతితో ధర్మారంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ టౌన్-1 పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. తూంపల్లికి చెందిన బూక్యనాయక్ ద్విచక్రవాహనం పోవడంతో 1వ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా భైంసాకు చెందిన భీమ్, సుభాష్ దొంగిలించిన బైక్‌లపై పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు పట్టుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి భైంసా, నందిపేట్, బాల్కొండ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 4 బైక్‌లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కోటగిరి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం కొడిచర్లకు చెందిన భీమయ్య పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సోమవారం ఎస్ఐ సునీల్ అందజేశారు. భీమయ్య 2 నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో పరిశీలించి, పోలీసులు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పజెప్పారు.

ముప్కాల్‌లో రోడ్ల సొగసు చూడతరమా..!

- దారిపై పారుతున్న మురుగు
- రాకపోకలకు ప్రజల అవస్థలు
- పన్నులు చెల్లిస్తున్నా వసతుల లేమి

ముప్కాల్, సెప్టెంబరు, 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఏదైన కాలనీ ఏర్పడితే అక్కడి వసతులతో మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలువాలి. కానీ ముప్కాల్ మండల కేంద్రంలోని నూతన కాలనీలో సౌకర్యాల మాట దేవుడెరుగు.... రోడ్లన్ని గుంతలమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 20, 30 ఏళ్ల కింద ట ఏర్పాటైన కాలనీలో వసతులు లేవు. ఇంటి పన్ను చెల్లిస్తున్నా తమ సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలికంగా నిర్మించిన డ్రైనేజీలు కూడుకపోవడంతో వర్షపు నీరు, మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. పాఠశాల విద్యాయులు, ప్రజలు మురుగులో నుంచి నడిచి వెళ్లేటప్పుడు జారిపడుతున్నారు. ఉర్దూమీడియం పాఠశాలకు, ఇందిరమ్మ కాలనీకి వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. డ్రైనేజీ నిర్మించిన స్థలం తనదేనని



రోడ్డుపై అవస్థలు పడుతున్న మహిళ

గ్రామానికి చెందిన వ్యక్తి దానిని పూడ్చివేయడంతో మురుగు రోడ్లపై పారుతోంది. ఈ విషయంపై గతంలో సానికులు ధర్నా నిర్వహించి తమ సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా ఫలితం దక్కలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని వేడుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తాం

డ్రైనేజీ సమస్య ఏర్పడిన స్థలంలో గ్రామానికి చెందిన వ్యక్తి ఇది తమ స్థలమేనని అభ్యంతరం చెప్పడంతో డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం జరిగింది. ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులను సంప్రదించి స్థలాన్ని నిర్ధారించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- మల్లేష్ యాదవ్, కార్యదర్శి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ బాల్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

కోటగిరి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు పేర్కొన్నారు. పోతంగల్‌లో సోమవారం ఉమ్మడి మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఒకే తాటిపై నడిచినప్పుడు పార్టీ మరింత బలపేతం అవుతుందన్నారు. కొత్తవారు, పాత వారు అనే భేదం లేకుండా అందరు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వాడలా కాంగ్రెస్ శక్తిని చాటి చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీ శంకర్, కోటగిరి మండల అధ్యక్షుడు షాహీద్, మనోహర్, పవన్, మధుసూదన్ రెడ్డి, సాయిలు, మన్సూర్, దత్తు, సాగర్, వీరేశం తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు ఇప్పించాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కోటగిరి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నేటికి బిల్లులు చెల్లించకపోవడంపై అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో సోమవారం సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ బిల్లుల కోసం పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.సుమారు వందమందికి బిల్లులు రాక అప్పుల ఊబిలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఒకరి బిల్లులను మరొకరికి ఇచ్చి అవినీతికి పాల్పడ్డారని, ఈ వ్యవహరంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన అనుచరులు ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ శాఖ ఏఈ నాగేశ్వర్‌రావు ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారని ఈలోపు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ,బీఆర్ఎస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు విఠల్‌గౌడ్, కిషన్, రవి, సమీర్, సంతోష్, గంగాప్రసాద్, మహేష్, నవీన్ తదితరులున్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..!



హంగర్గలో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం



సాలూరలో...



బోధన్‌లో నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



రెంజల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. ఆడబిడ్డలు సోమవారం తీరొక్క రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి గ్రామ కూడళ్లలో ఒక చోట చేర్చి ఆటపాటలతో ప్రత్యేక నృత్యాలు చేశారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా కోలాటాలు వేశారు. గ్రామ శివారులోని చెరువులకు తీసుకెళ్లి నిమజ్జనాలు చేశారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పురుషులు వారికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

ఓవరాల్ చాంపియన్‌గా కలిగోట్ జట్టు



షీల్డ్ అందుకుంటున్న విద్యార్థులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 22 (ఆంధ్రజ్యోతి): ఓవరాల్ చాంపియన్ షిప్ షీల్డ్ బహు మతిని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. మండలంలోని పడకల్‌లో 3 రోజుల పాటు జరిగిన మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడల్లో తమ విద్యార్థులు చాంపియన్‌గా నిలిచారని ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమ చారి సోమవారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఇతర క్రీడల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుపొందామన్నారు. విద్యా ర్థులను పురుషోత్తమచారి, పీఈటీ యాదగిరి, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు అభినందించారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

నవీపేట,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాలకు మండలంలో సుమారు 5వేల ఎకరాల పంటనష్టం జరిగిందని, వెంటనే బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని జనవికాస్‌సేవ సంస్థ జిల్లాధ్యక్షుడు తెడ్డు పోశెట్టి కోరారు. వానలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యుసుఫ్, ఇర్ఫాన్, ఆసిఫ్, నయీం, నరేష్, ప్రశాంత్, హర్నామ్‌సింగ్ తదితరులున్నారు.

గ్రంథాలయం పునఃప్రారంభం

మోస్రా,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీలో భాగంగా నిర్మించిన భవనంలో గ్రంథాలయ సామాగ్రి తరలించారు. నూతన భవనంలో గ్రంథాయాలన్ని సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పునఃప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, వీడీసీ చైర్మన్ పోతారెడ్డి, ఉమ్మడి వర్ని మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, లైబ్రరీ ఇన్‌చార్జి శ్వేత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు షురూ

నందిపేట,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంఠంలో సోమవారం సీసీ రోడ్డు పనులను నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు ప్రారంభించారు. రూ.5లక్షలతో సీసీరోడ్డు, రూ.5లక్షలతో మురికి కాలువలనిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. త్వరలోనే రూ.50లక్షలతో సిమెంట్ రోడ్డు, మురికికాలువల నిర్మాణం పనులను పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రారంభిస్తారని ఇంద్రుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, ప్రసాద్, గౌతమ్, పోశెట్టి, అశోక్, లింగం, సురేష్, లక్ష్మణ్, ప్రసాద్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి మారుతిరావు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఏర్గట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రేండ్ల ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం శ్రీబాల రాజరాజేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను కమిటీ చైర్మన్ చిన్నయ్య ప్రారంభించారు. దేవాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరుకి కృషిచేసిన కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌కుమార్‌కు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలని వినతి

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో ఇరిగేషన్ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఇరిగేషన్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. బఫర్‌జోన్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఎన్‌వోసి తీసుకొని నిర్మాణం చేపట్టారని ఆ భవంతిని పరిశీలించి ఎన్‌వోసిని రద్దు చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 40 గేట్ల ఎత్తివేత



శ్రీరామసాగర్ నుంచి గోదావరిలోకి విడుదలవుతున్న నీరు

మెండోరా,సెప్టెంబరు, 22(ఆంధ్రజ్యోతి): శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో సోమవారం సాయంత్రం అధికారులు 40 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి 1,45,272 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతుండగా.. వరద గేట్ల ద్వారా 2,38,720 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిసాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా.. 77ల నీరు నిల్వ ఉంది.

పరిశోధనస్థానం అధిపతిగా పవన్‌చంద్రారెడ్డి



అధిపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రూరు,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన స్థానం నూతన అధిపతిగా డా.పవన్ చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ చంద్రారెడ్డి మృతికాశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2007-2013 కాలంలో ఇక్కడే శాస్త్రవేత్తగా సేవలందించారు. 2013లో నిజామాబాద్ ఏరువాక కేంద్రానికి బదిలీపై వెళ్లి 2017 వరకు అధిపతిగా పని చేశారు. తర్వాత 2017-2018లో ఆరు నెలల పాటు పదోన్నతిపై సీనియర్ శాస్త్రవేత్తగా రుద్రూర్ పరిశోధనస్థానంలో పనిచేశారు. 2018-2023వరకు వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ హోదాలో విధులు నిర్వర్తించారు. 2023-2025 వరకు హైదరాబాద్‌లోని నేల ఆరోగ్య యాజమాన్య సంస్థలో ప్రధానశాస్త్రవేత్తగా పనిచేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన పవన్ చంద్రారెడ్డి రుద్రూర్‌కు బదిలీపై రావడంతో బోధన, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన అధికారులు



గుంతల్లో కంకర, మట్టివేయిస్తున్న దృశ్యం

రుద్రూరు,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం నుంచి అంబం(ఆర్) వరకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను సోమవారం పంచాయతీరాజ్ అధికారులు పూడ్చివేశారు. ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో "దారి'ద్ర్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు రుద్రూర్, అంబం(ఆర్) గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేయించారు. రోడ్డుపై గుంతలను పూడ్చివేయడంతో గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తుల ఆధిపత్యంతో వ్యవస్థకు నష్టం



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు

వేల్పూర్, సెప్టెంబరు, 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తుల ఆధిపత్యంతో వ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదిర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రామన్నపేట్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టప్రకారం ఏర్పడిన అధికార వ్యవస్థలే వ్యక్తుల హక్కులకు రక్షణగా నిలుస్తాయన్నారు. రామన్నపేట్ గ్రామాభివృద్ధి కమిటీని రద్దు చేసుకోవడం శుభసంకేతమని హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏర్పాటుచేసిన పంచాయతీలు, ఇతర అధికారిక వ్యవస్థలు, పౌరుల ప్రాథమిక అవసరాలు తీర్చే వేదికలన్నారు. వీడీసీల సామాజిక వెలివేతలు ఆమోదనీయం కావని, అవి చట్టవ్యతిరేక చర్యలని పేర్కొన్నారు. శాసనాలను రూపొందించుకొని అమలు చేసుకుంటున్నామని, వాటికి అనుగుణంగా పౌరులు నడుచుకోవాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారి పల్లెల్లోకి వ్యాపించిందని, యువత దానికి దూరంగా ఉండాలన్నారు. న్యాయవివాదాలను ఇరుపక్షాల సమ్మతి కోసం పరిష్కరించుకునే అత్యుత్తమ వేదిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ అని తెలిపారు. పేదలకు ఉచిత న్యాయసేవలు అందించడంలో సంస్థ ముందుంటుందని ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్, నారాయణ, మోర్తాడ్ ఎస్సై రాము, పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దయాకర్



డిప్యూటీ డైరెక్టర్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న దయాకర్

నిజామాబాద్‌లీగల్,సెప్టెంబర్22(ఆంధ్రజ్యోతి): స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దయాకర్‌గౌడ్ డీడీఓపీ ఛాంబర్‌లో డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి నర్సింహ చేతుల మీదుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరెడ్డి, కార్యదర్శి మానిక్‌రాజు, పీపీ రాజేశ్వర్, ఏసీపీ రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, డిఫెన్స్ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్, సురేష్, పలువురు జూనియర్ న్యాయవాదులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వర్ని వాసికి జాతీయ స్ఫూర్తి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బాలకృష్ణ

వర్ని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాతవర్నికి చెందిన ఇందూరి బలవీర్ బాలకృష్ణ జాతీయస్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బాపు చిత్రకళ, వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా జిల్లా కళాకారుల సమక్షంలో ఈ పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. 30 ఏళ్లకు పైగా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వివిధ కళానైపుణ్యంలో బలవీర్ తన ప్రతిభను చాటుకున్నారు. విద్యావైద్య, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళ, చిత్రకళ, మీడియా, వ్యవసాయం, పరిశోధన, స్వయంకృషి రంగాల్లో రాణించారు. పురస్కార ప్రదానంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి నరసింహారెడ్డి, వైద్యుల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్, సుమలత, చందర్, వెంకట్‌రెడ్డి, శంకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



హెల్త్‌క్యాంపును తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో రాజశ్రీ

ముప్కాల్,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సోమవారం డీఎంహెచ్‌వో రాజశ్రీ తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా చిన్నపిల్లలకు, మహిళలు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మందులు, చేసిన వైద్యపరీక్షల గురించి అడిగి తెలుసుకున్నా రు. ప్రభుత్వం లక్ష్యం మేరకు వైద్య సిబ్బం ది అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతా ల్లో ప్రతీఒక్కరికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. అంతకుముందు డీఎస్‌వో నాగరాజు వైద్యసేవలను పరిశీలించారు. ప్రజల నుంచి స్పందన వస్తుందని సుమారు 300 మందికి పరీక్షలు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, యశ్వంత్, బానుప్రియ, మధు, హరిబాబు, కీర్తిప్రియ, అక్షయ్, కీర్తన్, విజయ్, అమరదీపిక, సాగర్, రాజేందర్, మేరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ వీరయ్య పాల్గొన్నారు.

బుద్ధుడి జీవిత చరిత్ర పుస్తకాల అందజేత

వేల్పూర్, సెప్టెంబరు, 22(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామానికి చెందిన జిన్న జనార్ధన్ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధుడి జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. బుద్ధుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడి సిద్ధాంతాలని తెలుసుకోవాలన్నారు. అంబేద్కర్ మనోభావలకు అనుగుణంగా నడుచుకుంటూ బుద్ధుడి ఆశయాలను, సిద్ధాంతాలను పాటిస్తు ఆయన చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని చదువుకునే అలవాటు చేసుకుంటూ.. అందులో పొందుపర్చిన హక్కులు, విధులను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజవర్గంలో పలు అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



బతుకమ్మ అంటే సంబురమే

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి నిదర్శనంలా బతుకమ్మ పండుగ అంటే మహిళలందరికీ సంబురమే.నాచిన్ననాటి నుంచే తోటివారితో కలిసి బతుకమ్మ ఆటలు ఆడుతూ సరదాగా గడిపేవాళ్లం. ఇప్పటికీ బతుకమ్మ పండుగ కోసం ఎదురుచూస్తాను. రాజకీయంలో ఎంత బిజీ ఉన్నప్పటికీ బతుకమ్మ ఆడుతున్నాను. తొమ్మిది రోజుల పాటు ఊరు వాడా అంతటా పండుగ వాతావరణం కనబడుతుంది.

- దుర్గం శ్యామల ఏఎంసీ, చైర్‌పర్సన్, బీర్కూర్



సంతోషంగా జరుపుకుంటాం..

బతుకమ్మ సంబరాలను 9రోజుల పాటు సంతోషంగా జరుపుకుంటాం.చిన్నతనంలో మాతల్లి గారి ఊరు బీబీపేట మండలంలో యాడారం గ్రామంలో స్నేహితులతో కలిసి బతుకమ్మ ఆడి ఉల్లాసంగా గడిపేవారం.వివాహం అనంతరం దోమకొండలో సైతం మహిళలతో కలిసి అంబరాన్నం టేలా సంబరాలు జరుపుకుంటున్నాం.ఎంపీపీగా ఉన్నప్పుడు అధికారికంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం మరు వలేని విషయం.

-కానుగంటి శారద, మాజీ ఎంపీపీ, దోమకొండ



సంస్కృతి,సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతిక..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మపండుగ ప్రతిక. తాను చిన్నవయస్సులోనే కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవి బాధ్యతలు నిర్వహించినప్పటికి గత ప్రభుత్వ హయంలో అనేక బతుకమ్మ సంబరాలలో పాల్గొని బతుకమ్మ విశిష్టతను తెలుసుకున్నాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బతుకమ్మ సంబరాలలో ఖచ్చితంగా పాల్గొంటూ వస్తున్నాను. బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఎనలేని ఆనందం వస్తుంది.

- నిట్టుజాహ్నవి,మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కామారెడ్డి



దుర్గామాత భక్తుల మాలధారణ



మద్నూర్‌లో మాలధారణ వేసుకున్న దుర్గామాత భక్తులు

మద్నూర్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఆరాధన కోసం తొమ్మిది రోజులపాటు భక్తులు మాలాధారణ వేసుకున్నారు. మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన డాక్టర్ విజయ్ ఆధ్వర్యంలో 22 మంది యువకులు సోమవారం దుర్గామాత మాల ధారణ వేసుకున్నారు. 9 రోజులపాటు నియమ నిష్టలతో ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుందని సంకల్పంతో మాలలు ధరించినట్లు యువకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో యువకులు భక్తివైపు మొగ్గు చూపటంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నాయి. తమ పిల్లలు అయ్యప్ప, హనుమాన్ దీక్షలతో పాటు సరస్వతి దీక్షలు దురామాత దీక్షలు తీసుకోవడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేయడం ప్రభుత్వ లక్ష్యం



పాటల రూపంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రామారెడ్డి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మెన్ ఆదేశాల మేరకు సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పలు రకాలుగా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఆరు గ్యారెంటీలపై రోడ్డు భద్రత, తడి చెత్త పొడి చెత్త, ప్లాస్టిక్ నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత హరితహారం తదితర అంశాలపై పాటలు పాడడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు టీం లీడర్ రమేష్ రావు, నాయకులు మహేందర్, విట్టల్ రెడ్డి, దివ్య, నాగరాజు, రాము, సవిత, కాశీరాం, పోశెట్టి, తిరుపతి, లక్ష్మీనారాయణ, శిల్ప, లత తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ నూతన ఎస్సైగా మహేందర్

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల నూతన ఎస్సైగా మహేందర్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు బీర్కూర్ ఎస్సైగా పని చేసిన రాజశేఖర్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రానికి బదిలీ చేశారు. కామారెడ్డిలో వీఆర్‌లో ఉన్న మహేందర్ ను బీర్కూర్ ఎస్సై గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మహేందర్ గతంలో పెద్దకొడప్ గల్ ఎస్సైగా కూడా పని చేశారు. మండలంలో శాంతి, భద్రతలకు కృషి చేస్తానని నూతన ఎస్సై మహేందర్ అన్నారు. ఎస్సై మహేందర్, రాజశేఖర్‌లను పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

టీటీడీ హుండీ ఆదాయం లెక్కింపు



తిమ్మాపూర్ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో సోమవారం ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సమక్షంలో లెక్కించారు. సుమారు రెండు నెలల హుండీ ఆదాయం లెక్కించగా ఆరు లక్షల 4,405 రూపాయల ఆదాయం సమకూరినట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వరావు, వెంకట నరసరాజు, కిరణ్ , హరిబాబు రామకృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొరం విషయమై అధికారులతో వాగ్వాదం

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మొరం కొరతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతుంది. ప్లింత్ భీం వరకు పనులు చేసిన అనంతరం బేస్ మెట్ లెవెల్ మొరంతో ఫిల్ చేయాల్సి ఉంటుంది. అయితే మొరం కొరత కారణంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరమ్మ బిల్లులు కూడా రావడం లేదు. లబ్ధిదారులు రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ మొరను వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. సోమవారం ట్రాక్టర్లలో మొరం లోడ్ చేసి ఇందిరమ్మ ఇళ్ల వద్దకు తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మొరం తవ్వకాలు చేపట వద్దని సూచించారు. దీంతో మొరం తవ్వకాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా లబ్ధిదారులు సోమవారం తహసీల్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. మొరం తవ్వకాలను ఎందుకు నిలిపివేశారని అధికారులను ప్రశ్నించారు. మొరం తవ్వకాలపై సబ్ కలెక్టర్ కు కొందరు ఫిర్యాదు చేశారని, సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తవ్వకాలను నిలిపివేశారని అధికారులు సమాధానం చెప్పారు. ఫిర్యాదు ఎవరు చేశారని అధికారులను ప్రశ్నించారు. కానీ అధికారులు ఫిర్యాదు దారుల పేర్లను వెల్లడించలేదు. మొరం తవ్వకాల విషయమై సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు లబ్ధిదారులకు నచ్చచెప్పడంతో వాళ్ళు అక్కడి నుండి వెళ్లిపోయారు. మొరం కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, బిల్లులు మంజూరు కావడం లేదని లబ్ధిదారులు అధికారులతో వాపోయారు. మొరం తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

» మండపాల్లో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన పూజలు » శైలపుత్రిగా దర్శనమిచ్చిన అమ్మవారు » దీక్షపూనిన మహిళలు » యువకుల మాలధారణ



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్



దేవీని మండపానికి మంగళారతులతో స్వాగతిస్తున్న మహిళలు



పాల్వంచలో పూజలు చేస్తున్న భక్తులు



భీమ్‌గల్‌లో చిందు కళాకారులు నృత్యాలు చేస్తున్న దృశ్యం



బోధన్ శివాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యం



కోటగిరికి చేరుకున్న దుర్గామాత విగ్రహం



మెండోరాలో ప్రతిష్ఠించిన దుర్గామాత

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో సోమవారం దుర్గాదేవి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. సోమ వారం మండలంలోని అన్ని గ్రామాలలో మండపాలలో దుర్గదేవీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు మాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొ చ్చారు. మండపాల్లో ప్రతిష్ఠించి భక్తులు, మండపాల సభ్యులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో 11 రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణం కొనసాగనుంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



సాలూరలో యజ్ఞం నిర్వహిస్తున్న విగ్రహ దాత స్వామిగౌడ్



ఎల్లారెడ్డిలో ..




ఎడపల్లిలో కొలువుదీరిన అమ్మవారు, కమిటీ సభ్యులు



విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్న కమ్మర్‌పల్లి పెద్దమ్మ దేవాలయం



నిజాంసాగర్‌లో పూజలో పాల్గొన్న మాజీ ఎంపీపీ దంపతులు



ఇబ్రహీంపేట్‌లో..



బాన్సువాడటౌన్‌లో..



మహమ్మద్‌నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పల్లెల్లో విరబూసిన వైద్య కాంతులు

మద్నూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలోని మారుమూల పల్లెల్లో విద్యార్థుల ఇళ్లల్లో విరబూసిన వైద్య కాంతులు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువులో సత్తా చాటి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచిత మెడికల్ సీట్లు సాధించి తమ కలలను సాకారం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా లక్ష్య సాధనకు నిరంతరం తపించారు. విలువైన వైద్య విద్య వారి దరికి చేరింది. వారు మాట్లాడుతూ వైద్య విద్య పూర్తి చేసి. మారుమూల గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించడమే లక్ష్యమని ప్రకటిస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని డోంగ్లి, సుల్తాన్ పేట్, పెద్ద టాక్లి గ్రామాల నుంచి వైద్య విద్య అభ్యసించడానికి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు రావడంపై ఆయా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డోంగ్లి మండలానికి చెందిన ఆనంద్ రావు, అరుణ దంపతుల కుమారుడు ఆకాష్ రాష్ట్ర మెడికల్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో 440 ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని మెడిసిటీలో సీటు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుల్తాన్ పేట్ గ్రామానికి చెందిన రాజు పటేల్ ప్రీతం దంపతుల కుమార్తె రోష్ని పటేల్ 699 ర్యాంక్ సాధించి కామినేని ఆసుపత్రి ఎల్బీనగర్ లో సీటు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద టాక్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్ దేశ్ ముఖ్, విద్యా భారతి దంపతుల కుమార్తె గిరిజ దేశ్ ముఖ్ విద్యార్థినికి



ఆకాష్ (డోంగ్లి) రోష్ని (సుల్తాన్‌పేట్) గిరిజా (పెద్ద టాక్లీ)

ఇండియా లెవల్‌లో 102007 ర్యాంకు సాధించారు. ఈ విద్యార్థినికి కొత్తగూడెంలో సీటు రావడంపై గ్రామస్తులు అభినందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు రావడం తో గ్రామస్తులతో పాటు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా మెడికల్ లో సీట్లు వచ్చిన విద్యార్థులను ఆంధ్రజ్యోతి పలకరించగా వైద్య విద్య పూర్తి కాగానే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాన్సువాడలో భారీ వర్షం

బాన్సువాడటౌన్ , సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) ః బాన్సువాడ పట్టణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు అరగంటపాటు కురిసిన వర్షం కారణంగా రోడ్లు జలమయంగా మారాయి. వర్షాలు వరుసగా కురుస్తుండడంతో అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. పొట్ట దశకు చేరుకున్న వరిపంట దెబ్బతినే అవకాశాలున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట కన్నాపూర్ గ్రామస్థుల ధర్నా

» భారీ వర్షాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగినా గ్రామాన్ని సందర్శించని అధికారులు

లింగంపేట,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గత ఐదు రోజులుగా విద్యుత్, తాగునీరు లేక ఇ బ్బందులు పడుతున్నామని తమగ్రామాన్ని సంద ర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమ వారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామా నికి చెంది న చౌదరీ చెరవు గండిపడి వరద గ్రామంలోకి రావడంతో గ్రామంలోని 50ఇండ్లు కూలిపోయా యని, విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, తాగడా నికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగి నెల రోజులు కావస్తున్న ఒక తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి



ధర్నా చేస్తున్న గ్రామస్థులు

అధికారులు ఎవరు తమ గ్రామాన్ని సందర్శించలేదని గ్రామంలో మనుషులు ఉన్నారనే విషయాన్ని మర్చిపోయారని వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 20వరకు విద్యుత్ స్థంబాలు కూలిపోయి విద్యుత్ సమస్యలు ఏర్పడి నెల రోజులు కావస్తున్న కొత్తవాటిని ఏర్పాటు చేయలేదని దీంతో విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుందని బోరుమోటర్లు నడవక తాగునీటికి కటకట ఏర్పడుతుందని ఇంత జరిగినా గ్రామానికి ఎవరు సహయ సహకారాలు అందించలేదని వారు తెలిపారు.అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకుని సహకారం అందించాలని వారు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. . గ్రామానికి చెందిన వంతెన కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ రహదారుల భూసేకరణపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల భూసేకరణపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులకు ఆదేశించారు. దసరా పండుగకు అన్ని పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూముల వివరాలకు సంబంధించి పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణం పనులలో జాప్యం జరుగకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని జిల్లాల వారిగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తామని జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో వికాస్ మీనా, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, ప్రజ్ఞాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోధన్ జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజిస్ట్ పోస్టులకు వేతనం లక్షా 25వేలు ఉంటుందని, అర్హతగల అభ్యర్థులు దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో బోధన్ సూపరింటెండెంట్ కార్యాలయానికి ఈనెల 27లోపు అందజేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రకటనలో కోరారు.

హెపటైటిస్‌పై డీఎంహెచ్‌వో సమీక్ష

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):హెపటైటిస్ అనేది హెచ్ఐవి ఎయిడ్స్ కంటే ప్రమాదకరమైనదని ఒకరి నుంచి ఒకరికి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకులు, ల్యాబ్‌లు హెపటైటిస్ వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేసి జాబితాను అందజేయాలని కోరారు. అదేవిధంగా ల్యాబ్‌లో, బ్లడ్ బ్యాంకుల్లో తయారయ్యే బయోమెడికల్ వ్యర్థాలను జక్రాన్‌పల్లి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చెందిన వాహనాల ద్వారా పంపాలని సూచించారు. గణాంకాలను జనవరి నుంచి డిసెంబర్ వరకు లెక్కించాలన్నారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన పాజిటీవ్ కేసులను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి తుకారాం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, డాక్టర్ అంజన, డాక్టర్ సమత, టిహబ్ వైద్యులు దివ్య, బ్లడ్ బ్యాంకు వైద్యులు సుధాకర్, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు, వివిధ బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు పాల్గొన్నారు.

కంఠేశ్వర ఆలయంలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ పూజలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయాన్ని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత సోమవారం సందర్శించారు. ఆలయంలో జరిగిన అభిషేకంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు సుహాస్ శాఖాయ్, మకరంద్ శాఖాయ్‌లు ఆలయ విశిష్టతను ఆమెకు తెలియజేసి ఆశీస్సులు అందజేశారు. కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త ఉన్నారు.

'ప్రజావాణి' వినతులను పరిష్కరించాలి

● 89 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మెప్మాపీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు వినతిపత్రాలు సమర్పించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ కోరారు.


వినతులు అందజేస్తున్న బాధితులు

కలెక్టర్ అనుమతితోనే సెలవుపై వెళ్లాలి..

జిల్లా అధికారులు కలెక్టర్ అనుమతితోనే సెలవుపై వెళ్లాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం అధికారులకు పలు సూచనలు చేశారు. ఇష్టారీతిన కలెక్టర్ అనుమతి లేకుండా సెలవుపై వెళ్లరాదని తెలిపారు.

యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది..

కళాశాల యాజమాన్యం అధికంగా ఫీజులు చెల్లించాలని వేధిస్తుందని ఆర్మూర్ క్షత్రియ కాలేజీ డిప్లోమా విద్యార్థులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందినప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ 15,780 రూపాయలు పోను కళాశాల ఫీజు 880 రూపాయలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం చెప్పిందని ఈ సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాల ఫీజు, బిల్డింగ్ డెవలప్‌మెంట్ ఫీజు పేరుతో మొత్తం 24వేలు చెల్లించాలంటూ యాజమాన్యం ఒత్తిడి చేస్తుందన్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు అధికారులను కోరారు.

వెన్నుపూస వ్యాధిగ్రస్థులను ఆదుకోవాలి...

వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని ప్రజావాణిలో వినతి ప్రతం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి 15వేల రూపాయల పెన్షన్‌ను అందిస్తున్నారని అదే విధంగా జిల్లాలో 15వేల పెన్షన్‌ను అందజేయాలని కోరారు.

కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడానికే పత్తిపై దిగుమతి పన్ను తగ్గింపు..

కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడానికే 11 శాతం దిగుమతి పన్ను శాతం తగ్గింపు చేశారని పత్తి రైతులను మోసం చేయడానికి కేంద్రం కుట్రపూరితంగా దిగుమతి పన్ను తగ్గించిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్ విమర్శించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రైతులతో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మొక్కజొన్న పంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నాయకులు రామకృష్ణ, దేవారాం, సురేష్, బాబన్న, నడిపన్న, బాలయ్య, గంగన్న, దామోదర్, కిషన్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలపై ముందడుగు

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు జడ్పీ చైర్మన్, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలలో రిజర్వేషన్లు కల్పిస్తారు. షెడ్యూల్ ఏరియాలో ఎంపీటీసీ, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఎస్టీల జనాభాలో దామాషాలో 50 శాతం తగ్గకుండా, 100 శాతం జనాభా ఉన్న ఎస్టీ గ్రామ పంచాయతీలలో సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు సభ్యుల స్థానాలని ఎస్టీలకే కేటాయిస్తారు.

జిల్లాలో 8,51,417 మంది ఓటర్లు...

జిల్లాలో 545 గ్రామపంచాయతీలో ఉండగా, 5022వార్డులు, 31 జడ్పీటీసీ స్థానాలు 307 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. జాబితా ప్రకారం జిల్లాలో 8,51,417 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 4,54,621 మంది మహిళా ఓటర్లు కాగా 3,96, 778 మంది పురుష ఓటర్లు ఉన్నారు. ఇతర ఓటర్లు 18 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు వారం రోజుల్లోగా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గ్రామాలలో పోటీ చేయాల నుకుంటున్న ఆశావహులు ఇప్పటినుంచే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇందల్వాయి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన కొందరు ఎస్సీ మహిళలపై అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించి అవమాన పరిచిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యలకు సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గజ్జెల సాయమ్మ, ఆరేపల్లి సాయమ్మ, గజ్జెల పెద్ద సాయమ్మ, గజ్జెల గంగామణి, గోవింద్‌పల్లి గంగవ్వ, గోవింద్‌పల్లి బాలవ్వ, గోవింద్‌పల్లి సాగర్, రంజిత్ అనే ఎస్సీ కులస్తులను అదే గ్రామానికి చెందిన అగ్ర కులస్తులు కొండ రవి, కొండ రాములు, కొండ నర్సయ్య, కొండ శ్రీధర్, కొండ నారాయణలు కలిసి ఎస్సీ కులస్తులైన వారిని కులం పేరుతో దూషించిన వారిపై, దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉందని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోలేదని దీంతో మినీ వాటర్ నుంచి సొంత నిధులతో పైపులైన్ వేసుకొని నీటి సరఫరా చేస్తున్న క్రమంలో అగ్రకులానికి చెందిన కొందరు ఎస్సీ వారిపై కులంపేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

సిరికొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్తి అభియాన్ ఆరోగ్య శిబిరానికి మండలానికి చెందిన 195 మంది హాజరయ్యారు. ఈ శిబిరంలో డాక్టర్ క్రిస్టియాన, డాక్టర్ సందీప్‌రెడి, ఆప్తాల్మిక్ సహాయకులు రాజ్‌కుమార్ ఆరోగ్య పరీక్షలు చేశారని మండల వైద్యాధికారి డాక్టర్ అరవింద్ చెప్పారు. పిల్లలకు డాక్టర్ సందీప్‌రెడ్డి, మహిళలకు జనరల్ సర్జన్ డాక్టర్ క్రిస్టియాన, కంటి పరీక్షలను ఆప్తాల్మిక్ సహాయకులు రాజ్‌కుమార్ పరీక్షించారు. తొమ్మిది మందిని జిల్లా కేంద్రంజనరల్ ఆసుపత్రికి పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు.

నేడు ఎస్‌జీఎఫ్ బాలబాలికల ఉషూ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఎస్‌జీఎఫ్ అండర్-17 ఉమ్మడి జిల్లా ఉషూ బాలబాలికల ఎంపికలు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరి నాగమణి తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఎంపికలు ఉంటాయని, .వివరాలకు 9347216426ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ సంస్థలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మను తయారు చేసి అందులో గౌరమ్మను ఉంచి అధ్యాపకులు, విద్యార్థినిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ పువ్వులతో బతుకమ్మను పూజించే స్త్రీలకు ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రంగరత్నం, దండు స్వామి, నహిదాబేగం, రజిత, నాగజ్యోతి, దస్తప్ప, వెంకటరమణ, నరేష్‌కుమార్, సుధాకర్, రంజిత, ప్రతిభ, నవీన, లావణ్య, శ్రీలేఖ, రామస్వామి, బాలమణి, రామకిషన్, ఉదయ్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఆర్ఎం

ఆర్టీసీ ఆధ్వర్యంలో..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో రీజినల్ మేనేజర్ జ్యోత్స్న హాజరై బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలతో బతుకమ్మ ఆడారు. బతుకమ్మ అనేది తెలంగాణ ఆడపడుచుల ముఖ్య పండుగ అని సంస్కృతి వైభవానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్‌లు, అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఏఎంసీ చైర్మన్ పూజలు

మోపాల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి సోమవారం గాంధీ గంజ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డైరెక్టర్లు మల్లేష్, నరేందర్, సెక్యూరిటీ ఇంచార్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ గంజ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.